క్లుప్తంగా

ప్రేరణ, మార్గదర్శకాలే విజయానికి సోపానాలు



సదస్సులో మాట్లాడుతున్న డీడీ విజయలక్ష్మి

ఖమ్మంరూరల్: ప్రేరణ, మార్గదర్శకాలే విద్యార్థుల విజయానికి సోపానాలని ఖమ్మం గిరిజన సంక్షేమాభివృద్ధి డిప్యూటీ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని గొల్లగూడెంలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆంగ్లం, గణితం, భౌతిక శాస్త్రం, తదితరాలపై జరిగిన అవగాహన సదస్సుల్లో ఆమె మాట్లాడారు. విద్యార్థినులు లక్ష్యం ఎంచుకుని చదువుపై ఏకాగ్రత పెడితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వి.ప్రసాద్, ఏటీడీఓ సత్యవతి, డాక్టర్ రామకృష్ణ, రాణాప్రతాప్, కిరణ్‌కుమార్, కరుణాకర్, హెచ్‌డబ్ల్యూఓలు రమాకుమారి, సునీత, పులన్‌దేవి, హనుమంతరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పనులను అడ్డుకున్న ప్లాట్లదారులు..

ఖమ్మంఅర్బన్: నగరంలోని మున్నేరు వరద నుంచి రక్షణ కోసం నిర్మించనున్న రిటైనింగ్ వాల్ పనులను శనివారం కొంతమంది ప్లాట్లదారులు అడ్డుకున్నట్లు తెలిసింది. రంగనాయకుల గుట్ట ప్రాంతంలో వాల్‌ల నిర్మాణంలో ప్రైవేట్ పట్టా భూమి ప్లాట్లలో పనులు చేసేందుకు వెళ్లిన నిర్మాణ సంస్థకు చెందిన యంత్రాలను అడ్డుకున్నారు. తమకు పరిహారం లేదా ప్లాట్లకు ప్లాట్లు ఇచ్చిన తర్వాతనే పనులు మొదలుపెట్టాలని, అప్పటి వరకు పనులు చేయొద్దని అడ్డుకున్నట్లు తెలిసింది.

బాధ్యతగా పనిచేస్తే మంచి గుర్తింపు

కామేపల్లి: ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని ఎంఈఓలు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, వెంకట్ అన్నారు. శనివారం మండలంలోని గోవింద్రాల హైస్కూల్‌లో మండల నోడల్ అధికారి, హెచ్ఎం నాగేశ్వరరావు అధ్యక్షతన కామేపల్లి నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన వెంకట్‌లనుఘనంగాసన్మానించారు. అనంతరం ఎంఈఓలు మాట్లాడగా.. కార్యక్రమంలో హెచ్ఎంలు జ్యోతి, కోటేశ్వరమ్మ, రమేశ్, నిర్మల, ఉపాధ్యాయ సంఘ జిల్లా నాయకులు తోట శ్రీధర్, కొండి కుమారస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటలు నమోదు చేయించుకోవాలి

ఖమ్మంరూరల్: రైతులు యాసంగిలో వేసిన పంటలను ఏఈఓల వద్ద నమోదు చేయించుకోవాలని ఏడీఏ సరిత తెలిపారు. శనివారం మండలంలోని వెంకటగిరి, గుదిమళ్లలో జరుగుతున్న డిజిటల్‌క్రాప్ సర్వేను పరిశీలించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు ఎరువులు, పురుగుమందులు మోతాదు మించి వాడొద్దని, వ్యవసాయశాఖ సూచనల మేరకు ఎరువులు వేయాలని సూచించారు. ఏఓ ఉమానగేష్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ బలోపేతానికి కృషి చేస్తా..

ఖమ్మంఅర్బన్: రాష్ట్రంలో విద్యారంగ బలోపేతానికి కృషి చేస్తానని వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సంగంరెడ్డి సుందర్ రాజు యాదవ్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని అఖిల భారత యాదవ మహాసభ ఖమ్మం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభ జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి, ఎనిక వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కోటయ్య, సతీష్, శ్రీనివాస్, ప్రభాకర్, సుందర్ రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	16	బచ్చలికూర	3
వంకాయ	28		20
బెండకాయ	48	పాలకూర	3
పచ్చిమిర్చి	28		20
కాకర	44	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	48	తోటకూర	3
దొండ	28		20
పొట్లకాయ	38	గోంగూర	4
చిక్కుడు	38		20
గోరుచిక్కుడు	54	మెంతికూర	2
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	30		40
చామగడ్డ	48	పుదీన	1
క్యారెట్	38		25
క్యాప్సికం	48	–ఖమ్మం వ్యవసాయం	

నగర పాలక సంస్థలోని 60 డివిజన్లలో క్షేత్రస్థాయి సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ప్రజలు కేఎంసీ కార్యాలయానికి రావాల్సి ఉంటుంది. సమస్యపై ఫొటోలు తీసి, దరఖాస్తుతో కలిపి ఫిర్యాదులను సంబంధిత అధికారులు, కమిషనర్‌కు అందిస్తున్నారు. ఇలా ఏ చిన్న సమస్యకైనా కేఎంసీకి రావాల్సి వస్తుండడంతో వారి ఇబ్బందులను తొలగించేందుకు అధికారులు కేఎంసీ కార్యాలయం వేదికగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. అంతేకాక ఇప్పుడు సాంకేతికతను జోడించి క్యూఆర్ కోడ్, టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ఎక్కడి సమస్య కనపడినా.. కార్యాలయానికి రాకుండానే ఈజీగా ఫిర్యాదు చేయొచ్చు. – ఖమ్మంమయూరిసెంటర్



క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఫిర్యాదులు.. ఇక సులువు



110 ఫిర్యాదులు..

ప్రజల నుంచి క్యూఆర్ కోడ్‌స్కాన్, టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులను నమోదు చేసుకునేందుకు కంట్రోల్ రూమ్‌లో ఓ వార్డ్ ఆఫీసర్‌ను అధికారులు నియమించారు. గత నెల 28 నుంచి ఈ కంట్రోల్ రూమ్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాగా ఇప్పటి వరకు 110 ఫిర్యాదులు అందగా.. వీటిలో 80 శాతం వరకు ఫిర్యాదులను పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో శానిటేషన్‌కు సంబంధించిన సమస్యలపై సత్వరమే పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు.



ఫిర్యాదు పత్రం

సండే స్పెషల్

స్కాన్ చెయ్.. ఫిర్యాదు చేసేయ్..

- కంట్రోల్ రూమ్ సేవలు ప్రారంభం
- డివిజన్ల సమస్యలకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్
- అందుబాటులో క్యూఆర్ కోడ్, టోల్ ఫ్రీ నంబర్

నేరుగా ఫిర్యాదు చేసేలా..

స్థానికంగా పారిశుద్ధ్య, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, మంచినీటి సమస్యలపై ప్రజలు అధికంగా ఫిర్యాదులు చేస్తున్నారు. ఈనేపథ్యాన ప్రతీసారి కేఎంసీ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాల్సి వస్తుండడంతో వారి సమయం వృథా కావడంతో పాటు కార్యాలయం వరకు రావడానికి పడే బాధలను అధికారులు గుర్తించారు. ఇదివరకు సిటిజన్ బడ్డీ యాప్ అందుబాటులో ఉన్నప్పటికీ నగరవాసులు అంతగా వినియోగించకపోవడంతో ప్రజలు సులువుగా సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో రోడ్ల వెంట వ్యర్థాలు, డ్రెయిన్లలో మురుగు తదితర సమస్యలపై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నేరుగా ఫిర్యాదు చేసేలా వెసులుబాటు కల్పించారు. అంతేకాక ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ 83338 33696ను కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేశారు. కాగా, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన తర్వాత ఫిర్యాదుదారుని పేరు, ఫోన్ నంబర్, ప్రాంతంతో పాటు ఏ సమస్యపై ఫిర్యాదు చేస్తున్నారనే వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

అవగాహన కోసం..

స్థానిక సమస్యలపై ఫిర్యాదులు చేసేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలకు క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. నగరంలోని 60 డివిజన్‌లలో క్యూఆర్ కోడ్‌తో ఉన్న స్టిక్కర్లను ప్రధాన కూడళ్లల్లో, వీధుల్లో అంటించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను కంట్రోల్ రూమ్‌లోని ఉద్యోగి నమోదు చేసుకొని వాటిని వెంటనే సంబంధిత డివిజన్ జవాన్‌కు సూచిస్తూ సమస్యను వెంటనే పరిష్కరించేలా ఆదేశాలను జారీ చేస్తున్నారు. జవాన్ ఫిర్యాదును పరిశీలించి, పరిష్కరించిన తర్వాత ఫిర్యాదుదారుడికి సమస్య పరిష్కారం అయినట్లు సమాచారం ఇస్తున్నారు.

సత్వరమే పరిష్కరిస్తున్నాం..

స్థానిక సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు అందించేందుకు క్యూఆర్ కోడ్, టోల్ ఫ్రీ నంబర్లను ఏర్పాటు చేశాం. కంట్రోల్ రూమ్ నుంచి ఫిర్యాదులను మానిటరింగ్ చేస్తున్నాం. ఫిర్యాదులు అందిన వెంటనే పరిష్కరించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్నాం. నగరంలో క్యూఆర్ కోడ్‌తో కూడిన 2 వేల స్టిక్కర్లను అంటిస్తాం. టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదులు అందించవచ్చు.

– అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

తాగునీటి సమస్యలు రానివ్వొద్దు



కూసుమంచిలో నీటిసరఫరాను పరిశీలిస్తున్న ఈఈ

కూసుమంచి: వేసవిలో గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రానివ్వొద్దని మిషన్ భగీరథ ఈఈ పుష్పలత అధికారులకు సూచించారు. శనివారం మండల కేంద్రం కూసుమంచితో పాటు నేలపట్ల, నాయకన్‌గూడెం గ్రామాల్లో తాగునీటి సరఫరా తీరును పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి నీటి సరఫరా ఎలా ఉందని, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని, ఎక్కడా ఈ ఇబ్బంది కలుగకూడదని ఈఈ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. తాగునీటి ఇబ్బంది ఉంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలని, మరమ్మతులకు గురైన చేతిపంపులను వెంటనే బాగుచేయాలన్నారు. పైపులు, గేట్‌వాల్వ్‌ల రిపేర్లు ఉంటే వెంటనే సరిచేయాలని సూచించారు. ఏఈ రంజిత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ ఎం.యర్రయ్య తెలిపారు. మండలంలోని ఓటర్ల జాబితా ప్రక్రియ పనులను మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 18 ఎంపీటీసీలకు గాను 94 పోలింగ్ కేంద్రాలు, నామినేషన్లకు ఐదు ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే 32 గ్రామ పంచాయతీలకు 300 పోలింగ్ కేంద్రాలు, 10 నామినేషన్ల కేంద్రాలు చేర్పాటు చేశామన్నారు. మండలంలోని ఎంపీటీసీ, సర్పంచ్‌లకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని పేర్కొన్నారు.

వేతనాలు చెల్లించాలి

నేలకొండపల్లి: నేలకొండపల్లి సీహెచ్‌సీలో శానిటేషన్, పేషెంట్ కేర్ టేకర్, సెక్యూరిటీ గార్డుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కార్మికులు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు మాట్లాడుతూ..ప్రతి నెలా 7వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ, కార్మికులు హీరాలాల్, కమల, సాయి, సైదా తదితరులు పాల్గొన్నారు.

రుద్రాక్ష జాతి రత్నాల ప్రదర్శన



రుద్రాక్ష మాలను ప్రదర్శిస్తున్న నిర్వాహకుడు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నేపాల్ రుద్రాక్షలు, కరంగళి మాలల ప్రదర్శనను హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రుద్రాక్ష నిపుణుడు రుద్రాక్ష ప్రసాద్ శనివారం ప్రారంభించారు. పుట్టిన తేదీ, జన్మ రాశి, జన్మ నక్షత్రాలకు తగు రుద్రాక్షలు, జాతి రత్నాలు ఇస్తామని నిర్వాహకుడు, నేపాల్ రుద్రాక్షల మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 12వ తేదీ వరకు ఉంటుందన్నారు.

సన్మానం

ఖమ్మం మామిళ్లగూడెం: నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జగదీష్‌ను శనివారం ఖమ్మంలో కైకొండయిగూడెం యూత్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు, కై కొండాయిగూడెం యువకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగించే పనుల కారణంగా నేడు (ఆదివారం) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖాధికారులు తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు చేగొమ్మ, ముత్యాలగూడెం, కేశ్వాపురం, ధర్మాతండా, చింతల్‌తండా గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

‘కేఎండీసీ’లో ముగిసిన టాస్క్ ట్రైనింగ్ ప్రోగ్రాం

ఖమ్మంసహకారనగర్: నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల కాళోజీ నారాయణరావు సెమినార్‌హాల్‌లో గత వారం రోజులుగా టాస్క్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులకు మహీంద్రా ప్రైడ్ క్లాస్ రూమ్ నాంది ఫౌండేషన్ ఆధ్వర్యాన ఉద్యోగ సాధన నైపుణ్య శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈసందర్భంగా ట్రైనర్ ఇందూరి మనోజ్ ఉద్యోగాన్వేషణలో నేర్చుకోవాల్సిన మెళకువలు, స్కిల్స్‌ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.అప్పిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణారావు, టాస్క్ డీడీఎం దినేష్, కళాశాల ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆఫీసర్ ఆర్.పాపారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ‘ఎస్‌బీఐటీ’ విద్యార్థులు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని ఎస్‌బీఐటీ, డిప్లొమా కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులు ఈనెల 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి తెలిపారు. ఈమేరకు కళాశాల అధినేత జి.కృష్ణ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, డైరెక్టర్లు ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీపీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు, శ్రీనివాసరావు, ఏఓ జహీరుద్దీన్, పీడీ జగదీష్‌లు అభినందనలు తెలిపారు.

‘స్మార్ట్‌కిడ్జ్’లో ముగిసిన స్పోర్ట్స్ మీట్

ఖమ్మంసహకారనగర్: గత రెండు రోజులుగా స్మార్ట్ కిడ్జ్ పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న స్మార్ట్ కిడ్జ్ స్పోర్ట్స్ మీట్ శనివారంతో ముగిశాయి. రెండవ రోజు విద్యార్థులకు కబడ్డీ, కోకో, హార్డిల్స్, టిన్నికాయిడ్ తదితర పోటీలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య పర్యవేక్షణలో జరిగిన స్పోర్ట్స్ మీట్ బహుమతి ప్రధానోత్సవ సభకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి, జానపద, సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులను అన్నిరంగాల్లో తీర్చిదిద్దాలి



పాఠశాల సావనీర్‌ను విడుదల చేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి తదితరులు



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఖమ్మం మయూరిసెంటర్: విద్యార్థులను చదువుకే పరిమితం చేయకుండా అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సూచించారు. ఖమ్మంలోని వీవీసీ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ 40వ వార్షికోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని రంగాల్లో ప్రవేశం ఉండడం ద్వారా సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం చిన్నారులు నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మేయర్ పి.నీరజ, పాఠశాల కరస్పాండెంట్ రేకల భాస్కర్, ట్రెజరర్ గుర్రం ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాళ్లు విద్యులత, జీ.ఏ.శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో కీలకంగా నిలవాలి



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కమ్మ మహాజన సంఘం సభ్యులు



దేవాలయంలో పూజలు చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- ఖమ్మంమయూరిసెంటర్: సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ కమ్మ జాతి ఔన్నత్యాన్ని పెంపొందించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన కమ్మ మహాజన సంఘం బాధ్యులు శనివారం ఆయనను కలవగా మాట్లాడారు. ఐక్యంగా ఉంటూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని తెలిపారు. మేయర్ పునుకొల్లు నీరజ, సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాముతో పాటు కర్నాటి రమాదేవి, వజ్జా శ్రీనివాసరావు, తుళ్లూరి నిర్మల, పునుకొల్లు రాంబ్రహ్మం, రావూరి సైదుబాబు, రాంబాబు, తాళ్లూరి మురళీకృష్ణ, బండి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.
- ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం నగరంలో రోడ్ల వెడల్పు, ఇంటి స్థలాలు, పెన్షన్లు, రేషన్‌కార్డులు తదితర సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు మంత్రి తుమ్మలను కోరారు. సీపీఎం డివిజన్ కమిటీ అధ్యక్షుడు వై.విక్రమ్ ఆధ్వర్యాన మంత్రికి 20 సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నాయకులు ఎం.ఏ.జబ్బార్, దొంగల తిరుపతిరావు, షేక్ మీరాసాహెబ్, భూక్యా శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, వజినేపల్లి శ్రీనివాసరావు, బత్తుల ఉపేంద్ర, షేక్ నాగుల్ మీరా, పి.నాగసులోచన పాల్గొన్నారు.
- ఖమ్మంసహకారనగర్: ఖమ్మం వీడీవోస్ కాలనీలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ సమీపాన ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. కాగా, ఉత్సవాల్లో స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివసారావుతో పాటు మిక్కిలినేని నరేంద్ర, సంపెట శ్రీను, గుడిపాటి సురేష్, ఆలూరి మొగిలయ్య, కిలారు బాబ్జీ, ఏపూరి మధుసూదన్ రావు, చెరుకూరి రమేష్‌బాబు, వెంకటేశ్వరావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యమత్యంతోనే ఇళ్ల స్థలాల సాధన

ఖమ్మంసహకారనగర్: మూడు దశాబ్దాల జర్నలిస్టుల సొంతింటి కల సాకారం చేసుకునేందుకు జర్నలిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలని, స్తంభాద్రి జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుద్దేటి రమేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. మూడు ప్రధాన యూనియన్లు, హౌసింగ్ సొసైటీతో పాటు ప్రెస్‌క్లబ్ కమిటీతో కలిసి కార్యాచరణ రూపొందించాలని పిలుపునిచ్చారు. జర్నలిస్ట్ యూనియన్‌ల నేతలు మొయినుద్దీన్, అమరవరపు కోటేశ్వరరావు, సత్యనారాయణ, అచ్చిరెడ్డి, నామా పురుషోత్తం, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కూసుమంచి: మండలంలోని గైగోళ్లపల్లికి చెందిన ఆడెపు వీరబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఇతను గతంలో కూసుమంచిలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో పనిచేయగా.. తురకగూడెం గ్రామానికి చెందిన మహిళా కాంగ్రెస్ నాయకురాలు బుర్రా మమత రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఈమేరకు శనివారం అట్టి నగదును క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి బాధితుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

దిష్టిబొమ్మ దహనం

ఖమ్మంవన్‌టౌన్: అక్రమదారుల పేరుతో 104 మంది భారతీయులను అత్యంత అమానవీయంగా చేతులకు, కాళ్లకు సంకెళ్లు వేసి భారత్‌కు పంపడాన్ని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన శనివారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. ప్రపంచ వేదికపై భారతపౌరుల గౌరవాన్ని, హక్కులను కాపాడడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. భారతపౌరుల పట్ల అగ్రరాజ్య అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహరించిన దురహంకార, దుర్మార్గమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాగండ్ల దీపక్‌చౌదరి, దొబ్బల సౌజన్య, చోటాబాబా, బొడ్డు బొందయ్య, కార్పొరేటర్లు కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, రాపర్తి శరత్, గజ్జెల లక్ష్మి వెంకన్న, పాకాలపాటి విజయనిర్మల శేషగిరి, శ్రీనివాస్, బాణాల లక్ష్మణ్, షేక్ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే బడ్జెట్లు..

ఖమ్మం మామిళ్లగూడెం: వ్యవసాయ రంగాలకు ఊరట ఉండదని, కార్పొరేట్ల లాభాల కోసమే బడ్జెట్లు ఉపయోగపడతాయని ప్రముఖ ఆర్థిక రంగం నిపుణుడు డి.పాపారావు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక ఆధ్వర్యాన శనివారం మంచికంటి మీటింగ్ హాల్‌లో ‘కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ఒక సమగ్ర విశ్లేషణ’అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు లాభం చేకూర్చని బడ్జెట్‌గా ఇటీవల కేంద్రం విడుదల చేసిన బడ్జెట్ ఉందన్నారు. ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక బాధ్యుడు అన్నాబత్తుల ప్రదీప్‌కుమార్ అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేదిక కన్వీనర్ ఎం.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఇటీవల మరణించిన ఎస్ఎఫ్ఐ పూర్వ కార్యకర్త కళ్యాణపు సాంబశివరావు మృతికి సంతాపం ప్రకటించారు. అలాగే ఇటీవల భారతీయులను అమెరికా నుంచి స్వదేశానికి పంపడంపై మోదీ నాయకత్వంలోని భారతదేశ మెతక వైఖరిని తీవ్రంగా ఖండించారు.

జయప్రదం చేయండి



తిరుమలాయపాలెంలో మాట్లాడుతున్న శ్రీను

ఖమ్మంమయూరిసెంటర్/తిరుమలాయపాలెం: హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ఈ నెల 10న జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్, సీపీఎం తిరుమలాయపాలెం మండల కార్యదర్శి శ్రీను పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ప్రవీణ్, తిరుమలాయపాలెం సమావేశంలో శ్రీనులు మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని నిరసిస్తూ, ఆర్ఎస్ఎస్ వ్యూహాలు విద్యలో అమలుకు వ్యతిరేకంగా, రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్, ఐద్వా, సీఐటీయూ, డీవైఎఫ్ఐ ప్రజాసంఘాల ఆధ్వర్యాన ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐద్వా మండల కార్యదర్శి వేగనాటి మంగతాయి, కేవీపీఎస్ మండల కార్యదర్శి, దాసరి మహేందర్, నాయకులు వినోద్, మణికంఠ, మనోజ్, త్రినాథ్, కార్తీక్, రాము, నాగేశ్వరావు, నరసయ్య, వెంకటేష్, వీరన్న, రమేష్, నాగేశ్వరావు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు



ఖమ్మం త్రీటౌన్‌లో బాణసంచా కాల్చుతున్న బీజేపీ నేతలు



నేలకొండపల్లిలో స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల ఆ పార్టీ నాయకులు శనివారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణసంచాలు పేల్చి, మిఠాయిలు పంచి పెట్టారు. రానున్న రోజుల్లో తెలంగాణలోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతున్నాయని, ఇది ప్రజాస్వామ్య గెలుపుగా మోదీ నాయకత్వాన్ని ఢిల్లీ ప్రజలు ఇచ్చిన తీర్పు అని పలువురు నాయకులు పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

- **తెలంగాణలో వచ్చేది బీజేపీనే..**
ఖమ్మం మామిళ్లగూడెం: గత 27 ఏళ్ల తర్వాత దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీ అధికారంలోకి రావడంపై బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్‌రావు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇదే ఉత్సాహంతో తెలంగాణలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయఢంకా మోగిస్తామన్నారు.
- **ఢిల్లీ ఫలితాలు.. ఫాసిస్ట్ శక్తులకు ఊతం..**
ఖమ్మంమయూరిసెంటర్: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు.. దేశంలో పెరుగుతున్న విద్వేషశక్తుల, ఫాసిస్ట్ వర్గాల కుట్రలకు, ఎత్తుగడలకు ఊతం లభించేలా ఉన్నాయని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నేతలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామికవాదులు, దేశభక్తి గల యువత ఫాసిస్ట్ శక్తుల విషయంలో మరింతగా ప్రజల్లో చైతన్యం కలిగించాలని పిలుపునిచ్చారు.
- **అక్రమాలతో గెలిచిన బీజేపీ**
ఖమ్మం మామిళ్లగూడెం: గత రెండేళ్లుగా ఆమ్ ఆద్మీపార్టీ పరిపాలనను ఢిల్లీలో స్తంభింపజేయడం ద్వారా, అధికార దుర్వినియోగంతో ఢిల్లీలో బీజేపీ గెలిచిందని ఆమ్ ఆద్మీపార్టీ ఖమ్మం పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఎస్.తిరుమలరావు, ఖమ్మం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు స్వర్ణ సుబ్బారావు, పి.శ్రీనివాస్‌లు, ఆప్ మీడియా ఇన్‌చార్జ్ సూర్యదేవర సంగమేశ్వరప్రసాద్‌లు శనివారం తెలిపారు. ఆప్‌కు ఓట్లేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.